RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :334 బుధవారం , ఏప్రిల్ 1, 2026, పేజీలు -20 వెల :5/-

# నిర్వాసితులు, డిఫెన్స్ భూముల పై సంప్రదింపులు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవం పై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు.

- మిగతా2లో



## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

## మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



తెలంగాణ పత్రిక ప్రతినిధి : తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన

- మిగతా2లో

## పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

### మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

తెలంగాణ పత్రిక ప్రతినిధి : పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- మిగతా2లో



## శ్రీశైలంలో అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి

## మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుంచి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో వేసివి నీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పవర్ జెనరేషన్ చేయొద్దని నిబంధన ఉందని.. ట్రయిల్స్ చేయొద్దని జీవో కూడా ఉందని అన్నారు. తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని సమైక్య రాష్ట్రంలో ఇచ్చిన జీవో స్పష్టంగా ఉందని మంత్రి జూపల్లి అన్నారు.

- మిగతా2లో




## పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ




తెలంగాణ పత్రిక ప్రతినిధి : నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రం పై కమిషనర్ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు.

- మిగతా2లో

## 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతి

### హైదరాబాద్‌లో భారీగా శోభాయాత్ర



తెలంగాణ పత్రిక ప్రతినిధి : ఏప్రిల్ 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా 'వీర హనుమాన్ విజయ యాత్ర' నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గత 22ఏళ్లుగా కొనసాగుతున్న ఈ భారీ శోభాయాత్ర.. ఈ ఏడాది కూడా కర్మన్ ఘాట్ నుండి ప్రారంభమై గౌలిగూడ

- మిగతా2లో

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు పంపింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ నగరంలో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు

- మిగతా2లో



## 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం



తెలంగాణ పత్రిక ప్రతినిధి : ఇరాన్ పై అమెరికా భీకరంగా దాడి చేస్తూ విధ్వంసకర పేలుడు పదార్థాలు, క్షిపణులను ఆ దేశం వినియోగిస్తున్నది. చాలా ఖరీదైన ఆ ఆయుధాల వల్ల అమెరికా అనూహ్య రీతిలో యుద్ధం కోసం ఖర్చు చేస్తున్నది. ఇరాన్ వార్ కోసం అమెరికా ఖర్చు చేస్తున్న గణాంకాలను పరిశీలిస్తే షాక్ అవ్వాల్సిందే.

- మిగతా2లో

## ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత



తెలంగాణ పత్రిక ప్రతినిధి : హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరత పై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని

- మిగతా2లో

## మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

తెలంగాణ పత్రిక ప్రతినిధి : తెలంగాణలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పౌల్ట్రీ

- మిగతా2లో



## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు



తెలంగాణ పత్రిక ప్రతినిధి : ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని

- మిగతా2లో

## శ్రీశైలంలో అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ హైకోర్టులో గతంలో పిల్ ఫైల్ కూడా చేశామని..జస్టిస్ పినాకి గోష్ ఇచ్చిన తీర్పు కూడా ఉందని అన్నారు. కరెంటు ఉత్పత్తి చెయ్యడానికి వీలు లేదని అన్నారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన ఖర్మ ఏపీకి ఎందుకని అన్నారు మంత్రి జూపల్లి. ధర్నా చేస్తామని చెప్పడంతో ఏపీ ప్రభుత్వం పంపింగ్ ఉపసంహరణ చేసుకుందని అన్నారు. పాలమూరు రైతాంగం, ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. వాటర్ అలకేషన్ అంశం కోర్ట్ లో పెండింగ్ లో ఉందని... 69 శాతం తెలంగాణకు 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం మన రాష్ట్ర హక్కును కాపాడుతుందని.. అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తోందని అన్నారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలతో ఏపీ తెలంగాణ మధ్య నీటి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.ం

## 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతి

-మొదటిపేజీ తరువాయి

ఈ ఏడాది కూడా కర్మన్ ఘాట్ నుండి ప్రారంభమై గౌలిగూడ రామ్ మందిరం చేరుకుంటుంది. అక్కడి నుండి సికింద్రాబాద్ లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర సాగనుంది. ఈ భారీ యాత్రను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, వీహెచ్‌పీ / భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు. యాత్ర సాగే మార్గంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం,ఇతర మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అధికారులు గౌలిగూడ రామ్ మందిరం నుండి అఫ్జల్ గంజ్ మీదుగా తాడ్ బండ్ వరకు రూట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్, పలు హిందూ సంఘాల నాయకులు పోలీసులకు కొన్ని ముఖ్యమైన విజ్ఞప్తులు చేశారు. గతంలో అబిడ్స్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి యాత్రకు ఆటంకం కలిగించారని, ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అలాగే యాత్ర ముగిసే వరకు ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను, అలంకరణలను తొలగించవద్దని విన్నవించారు. గణేశ్ ఉత్సవాల తరహాలోనే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలకు కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా పండుగ వాతావరణంలో జరుపు కునేలా సహకరించాలని అధికారులను కోరారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నంబర్ 30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది కౌశిక్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు అడ్డంకి కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశాడని కౌశిక్ రెడ్డి పై ఆరోపణలు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్లు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30కు విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసుల్లో స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణ కు సహకరించాల్సిందిగా కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

-మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశార. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16 కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తంచేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు రేపటి నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాల పై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

# నిర్వాసితులు, డిఫెన్స్ భూముల పై సంప్రదింపులు

-మొదటిపేజీ తరువాయి

అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

-మొదటిపేజీ తరువాయి

డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుడోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

# పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

-మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం

-మొదటిపేజీ తరువాయి

ఇరాన్ వార్ కోసం ప్రతి సెకనుకు అమెరికా సుమారు 9.8 లక్షలు అంటే 10వేల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యుద్ధం 31వ రోజుకు చేరుకున్నది. అమెరికా పన్నుదారులకు చెందిన సుమారు 2.63 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమైన యుద్ధం ప్రస్తుతం భీకర స్థాయికి చేరుకున్నది. ఈ యుద్ధం కోసం ప్రతి రోజు అమెరికా ప్రభుత్వం దాదాపు 8455 కోట్లు(890 మిలియన్ల డాలర్లు) ఖర్చు చేస్తున్నది. పేలుడు పదార్థాలు, ఎయిర్ ఆపరేషన్స్, మిస్సైల్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్‌తో అన్ని ఖర్చులు లెక్కేస్తున్నారు. ఎస్ఐపీఆర్ఐ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మునిషన్స్, మిస్సైళ్లకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రతి రోజు వాటి కోసం సుమారు 3040 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం ఖర్చులో అది 36 శాతంగా ఉంది. తోమాహాక్ క్రూయిజ్ మిస్సైళ్లు, జేడీఏఎం బాంబులు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులు ఉన్నాయి. వైమానిక ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 2327.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోజు వారి ఖర్చులో ఇది 27.5 శాతంగా ఉంది. నౌకాదళ ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 1475 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యుద్ధ నౌకల మోహరింపు, డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్లు ఈ జాబితాలో ఉన్నాయి. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ థాడ్, పాట్రియాట్, ఏజిష్ బీఎండీ కోసం ప్రతి రోజు సుమారు 902 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది రోజువారీ ఖర్చులో 11 శాతంగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్స్ కోసం 427 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐఎస్ఆర్ ఎ÷-లాట్‌ఫామ్స్, శాటిలైట్ ఇమేజ్‌లు, సైబర్ ఆపరేషన్స్ దీంట్లో ఉన్నాయి. పర్సనల్, లాజిస్టిక్స్ కోసం ప్రతి రోజు 285 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం ఖర్చు మితిమీరిన నేపథ్యంలో.. ఈ అంశంపై గల్ఫ్ దేశాలతో అమెరికా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధ ఖర్చుల్లో గల్ఫ్ దేశాల సహాయాన్ని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయి. 1990లో జరిగిన గల్ఫ్ వార్ సమయంలో జపాన్, జర్మనీ దేశాలు అమెరికాకు సాయం చేశాయి. ప్రస్తుతం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇరాన్ కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలను అమెరికా సాయం కోరే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

-మొదటిపేజీ తరువాయి

మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అని అన్నారు.

## పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

-మొదటిపేజీ తరువాయి

నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్



# సమన్వయంతో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు చేపట్టాలి

**-బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 31 ( తెలంగాణ పత్రిక )



జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసినిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,రామగుండం పరిధిలో పలు చోట్ల డ్యామేజైన బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ మరో మారు వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, ఎన్.పి.డి.సి.ఎల్, లోకల్ బాడీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన విద్యుత్ పోల్స్, త్రాగు నీటి పైప్ లైన్ , రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ఆ ప్రాంతంలో వేసిన అండర్ గ్రౌండ్ డ్యామేజ్ కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెల్ ఫోన్ నెట్ వర్క్ సజావుగా కొనసాగేందుకు వేసవి కాలంలో విద్యుత్ కోతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, మెయింటెనెన్స్ పనుల నిమిత్తం కరెంట్ కోతులు విధించే అవసరం వస్తే బ్యాకప్ ముగిసే లోపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగేలా చూడాలని అన్నారు. సెల్ ఫోన్ సిగ్నల్, బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ సంబంధించి ప్రతి నెలా సంబంధిత శాఖ అధికారులు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ కాళిందిని,ఆర్ అండ్ బి ఈ ఈ బావ్ సింగ్ , సి సెక్షన్ సూపరింటెంట్ కుమారస్వామి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ గా ఆర్డీవోకు బాధ్యతలు

కామారెడ్డి ,మార్చ్ 31, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి పట్టణ మున్సిపల్ కమిషనర్ సెలవు పై వెళ్లడంతో ఆర్డీవో గిరికి ప్రభుత్వం బాధ్యతలు సోమవారం అప్పగించారు. కామారెడ్డి మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. నూతనంగా ఏర్పాటైన కౌన్సిల్ ఆగ్రహానికి గురైన కమిషనర్ రాజేందర్ రెడ్డి బడ్జెట్ సమావేశం జరిగిన శనివారమే సెలవుపై వెళ్లారు. వచ్చేనెల 12వరకు కమిషనర్ సెలవుపై వెళ్లినట్టుగా తెలుస్తోంది. అయితే అప్పటివరకు కామారెడ్డి ఆర్డీఓ ఎన్ వై గిరికి కమిషనర్ గా బాధ్యతలు అప్పగించారు. దాంతో ఆయన సోమవారం సాయంత్రం కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోను మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ సెలవుపై వెళ్లడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నూతన పాలకవర్గం ఆయనను సరెండర్ చేయాలని బడ్జెట్ సమావేశం లో తీర్మానం చేయడంపై ఆయన అసహనానికి గురైనట్లుగా తెలుస్తోంది. అందుకే ఆయన అదే రోజు సెలవు పెట్టి వెళ్లినట్లుగా ప్రచారం సాగుతోంది. అయితే ఏప్రిల్ 5న జనరల్ బాడీ సమావేశం జరగనున్న సందర్భంగా మరోసారి పాలకవర్గ సభ్యులు కమిషనర్పై సరెండర్ తీర్మానం చేసే అవకాశాలు ఉన్నట్లుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో కమిషనర్ సెలవుపై వెళ్లడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే టీపీవో గిరిధర్ సెలవులో ఉండగా కమిషనర్ సూచన మేరకే బడ్జెట్ సమావేశం రోజు వచ్చి మధ్యాహ్నమే వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. ఆరోజు టీపీవో సెలవులో ఉండి సమావేశానికి రాకపోయి ఉంటే ఆయనపై సరెండర్ తీర్మానం చేసేవారు కాదన్న టాక్ వినిపిస్తోంది. అయితే కమిషనర్ ఏప్రిల్ 12వరకు సెలవుపై వెళ్లడంతో తిరిగి వచ్చేవరకు ఆర్డీవోనే కమిషనర్ గా కొనసాగుతారు.

# మండలంలో విచ్చలవిడిగా అక్రమ బెల్ట్ షాపుల జోరు

**-పట్టించుకో నీ ఎక్సైజ్ సివిల్ అధికారులు**

కామారెడ్డి ,మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



అధికారుల నిర్లక్ష్యం ఉదాసీన వైఖరి కారణంగా గ్రామాలలో విచ్చల విడిగా బెల్టు షాపుల నిర్వహణ కొనసాగుతుంది. గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్న సదరు అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సదరు బెల్ట్ షాపుల వ్యాపారులు అందించే మామూళ్లకు తలొగ్గుతున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అడిగేవారు ఎవరన్నా ధీమాతో సదరు వ్యాపారులు దందాను కొనసాగిస్తున్నారు. దీంతో వారు అడ్డగోలుగా సంపాదిస్తున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే అనుమతులు ఉన్నట్లు వ్యాపారులు మూడు పువ్వులు ముప్పయి ఆరు కాయలుగా దందాను సాగిస్తున్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలో అక్రమ బెల్టు షాపుల దందా ధర్జాగా కొనసాగుతుంది. అక్రమ బెల్టు షాపులను నియంత్రించాల్సిన సదరు ఎక్సైజ్ శాఖ అధికారులు వాళ్ళు ఇచ్చే ముడుపులకు తలోగ్గడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాలలో బెల్టు షాపు లు ధర్జాగా కొనసాగుతున్నాయి. బెల్ట్ షాపులలో వైన్స్‌షాపులను మరిపించే విధంగా మధ్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో యువకులు ఉదయం నుంచే మద్యం మత్తులో ఊగిపోతున్నారు. మద్యం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మద్యాన్ని నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 10 గంటలు అయ్యిందంటే చాలు ఎక్కడబడితే అక్కడ గ్రామాల్లో సిట్టింగులు కొనసాగుతున్నాయి.మద్యం మత్తులో ప్రయాణికులకు అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నత్తనడకన ప్రధాన రహదారి పనులు జరగడం వల్ల వాహనదారులకు మరింత ప్రమాదాలు సంభవిస్తున్నాయి అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని.ఎలాంటి ప్రభుత్వశీ బెల్ట్ షాపులపై ఇలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను విక్రయిస్తూ ఉన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని మండలంలోని ఆయా గ్రామాల యువకులు కోరుతున్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమం






కథలాపూర్ తెలంగాణ పత్రిక మార్చి 31

ఈరోజు వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండల కేంద్రంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మండల ప్రశిక్షణ మహా అభియాన్ – 2026 సందర్భంగా 24 గంటల శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ఒక క్రమశిక్షణ గల, సిద్ధాంతపరమైన పార్టీ అని తెలిపారు. ఇతర పార్టీలతో పోలిస్తే బిజెపి ప్రత్యేకత దాని బలమైన సిద్ధాంతాలు, దేశభక్తి భావన, మరియు సేవా దృక్పథం అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను గుండెల్లో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి అంత్యోదయ సిద్ధాంతం సమాజంలోని చిట్ట చివరి వ్యక్తి వరకు అభివృద్ధి చేరాలి అన్న భావన ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని అన్నారు.అదే భావంతో పార్టీ కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి,వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణే పార్టీ బలమని,ఒక కార్యకర్త తన వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ మరియు దేశ ప్రయోజనాలను ముందుంచాలని తెలిపారు.పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో, అంకితభావంతో నిర్వర్తిస్తేనే బిజెపి మరింత బలపడుతుందని అన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు కార్యకర్తలకు పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, విధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ప్రతి కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవలో ముందుండాలని కోరారు. మండల స్థాయి నుండి బూత్ స్థాయి వరకు క్రమబద్ధమైన వ్యవస్థను నిర్మించి పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పని చేస్తే భవిష్యత్తులో బిజెపి ఘన విజయాలు సాధించడం ఖాయం అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తలు మాజీ మండల అధ్యక్షులు ముంజ శ్రీనివాస్,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి,జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్ హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశం విజయవంతం కావడానికి కృషి చేసిన మండల నాయకులు వారు అభినందనలు తెలియజేశారు. పాల్గొన్న ప్రతి కార్యకర్త ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి, ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, సీనియర్ నాయకులు బద్రి సత్యం, గాందారి శ్రీనివాస్, పిడుగు ఆనంద్ రెడ్డి, కంటే రాజాం, అందే రాజాం మరియు బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంఛార్జ్, సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# వార్డ్ కౌన్సిలర్ ను సన్మానించిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ హనుమాన్ సత్ సంఘ భక్తులు



కామారెడ్డి , మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి పట్టణ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో గల శ్రీ లలితా త్రిపుర సుందరి సహిత సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం ఆ వార్డు కౌన్సిలర్ రామ్ శెట్టి హర్షితను భక్తుల ఆధ్వర్యంలో ఆలయ పూజారులు వేదమంత్రాల మధ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హర్షిత మాట్లాడుతూ, నన్ను చిన్న వయసులోనే మీరు ఆదరించి మీ అమూల్యమైన ఓట్లతో గెలిపించినందుకు వార్డ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం ప్రజల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రకాశం స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పరీక్షలు నిర్వహణ



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 31

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మంగళవారం తెలంగాణ క్రీడా పాఠశాలలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపిక పరీక్షలను నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు పలు శారీరక దృఢత్వం నైపుణ్యాల ఆధారిత పరీక్షలు నిర్వహించారు.
ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎత్తు, బరువు కొలతలతో పాటు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6ఐ10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ తదితర విభాగాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేసి, మొత్తం 20 మందిని వచ్చే నెల సికింద్రాబాద్ హకీంపేటలో గల రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలో జరిగే తుది ఎంపికలకు పంపించనున్నట్లు జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.జి.ఎఫ్ నరేష్, కోచ్ మల్లికార్జున్, మంగీలాల్, స్టెల్లా, వేణుగోపాల్, యుగంధర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# నేల రాలిన మామిడి

**-రూ. 2లక్షల50 నష్టపోయిన మామిడి రైతులు**





ముధోల్:31మార్చ్(తెలంగాణ పత్రిక)

ముధోల్ నియోజకవర్గంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాడడంతో మామిడి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.మండల కేంద్రంలోని బాబా షఫీ ఉల్లా ఖాన్ కౌలుకు తీసుకున్న మామిడి పంట నేల రాలడంతో రూ. లక్ష 50వేలు, అదేవిధంగా పొట్టోళ్ల రాములుకు చెందిన 2 ఎకరాల మామిడి తోట లో మామిడికాయల నేలరాలడంతో రూ. లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు. దీంతో మంగళవారం నష్టపోయిన మామిడి పంటలను హార్టికల్చర్ అధికారి జావిద్ పాషా నేల రాలిన మామిడి తోటలను పరిశీలించారు. నివేదికలను ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వీచిన ఈదురు గాలులకు నియోజకవర్గ వ్యాప్తంగా 200 ఎకరాల్లో మామిడి పంట ఉండగా 100 ఎకరాలు మామిడి రైతులకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది మామిడి పంట అంతంత మాత్రంగా ఉన్న పెట్టిన పెట్టబడులు వస్తాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందివ్వాలని వేడుకుంటున్నారు.

## ప్రజలందరూ కులాలకు, మతాలకు అతీతంగా కలిసి ఉండాలి

-ప్రజలు అందరూ సమానమే




తెలంగాణ పత్రిక జహీరాబాద్ (ప్రతినిధి)మార్చ్ 31

జాహీరాబాద్ మండలంలోని తూముకుంట గ్రామంలో ఈ రోజు గ్రామపంచాయతీ ఆఫీసు నందు పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా సమావేశం నిర్వహించడం జరిగింది.ఇట్టి సమావేశంలో సమాజంలో అంటారనితనం ను నిర్మూలించాలని,ప్రజలందరూ సమానమే అని, అదే విదంగా ాజ ాు లకు విద్యా, ఉపాధి రంగాలలో గల ప్రత్యేక అవకాశాల ను వివరించి వాటిని సద్వినియోగ పరచుకోవాలని తెలపడం జరిగింది. ఇట్టి సమావేశంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి,RI, SC వెల్ఫేర్ department అధికారులు, GPO, గ్రామస్తులు మరియు జహీరాబాద్ టౌన్ ఎస్.ఐ. కాశీనాథ్ గారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి సీఎం ప్రత్యేక దృష్టి

-మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావు పటేల్



ముధోల్:31మార్చ్(తెలంగాణ పత్రిక)

ప్రజా ఆరోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ముధోల్ మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ ఇంచా ర్జ్ భోస్లే నారాయణరావు పటేల్ అన్నారు.మంగళవారం బైంసా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 7 మండలాలకు సంబంధించిన 60 సిఎంఆర్ఎఫ్ కింద రూ.20 లక్షలను చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకు న్న త్వరలోనే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజారోగ్యా నికి పెద్దపీట వేయడం జరుగు తుందని పేర్కొన్నారు. దీంతో చెక్కులను అందించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కమిటి అధ్యక్షులు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, భైంసా, ముధోల్,బాసర మండలాల అధ్యక్షు లు షాహిద్, రావుల గంగారెడ్డి, మామ్మయి రమేష్,నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డీ,రామచందర్ రెడ్డి, శ్యాం రావు పటేల్, అష్ట, బెంబర్ సర్పంచులు రావుల శ్రీనివాస్, లక్ష్మణ్,కుభీర్ మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జడే శ్రీనివాస్, కుభీర్ మండల యువ నాయకుడు పురం శెట్టి రవి కుమార్ ,హన్మంతరావు పటేల్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక చేయూత




నర్సంపేట మార్చి 31 తెలంగాణ పత్రిక

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో యందు మహాలక్ష్మి సంబురాలు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ అ ధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథి గా హాజరై రెగ్యులర్ గా బస్సులో ప్రయాణం చేసే మహిళా ప్రయాణికులను శాలువా, బహుమతులతో సన్మానం చేసారు. మహాలక్ష్మి పథకం వల్ల నర్సంపేట డిపో నుండి 2కోట్ల 49లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి 106కోట్లు ఆదా చేసుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గణేష్ , ఆర్డీవో ఉమారాని మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ , మున్సిపల్ కమిషనర్ , తహసీల్దార్ , మహిళా సమాఖ్య సభ్యులు, డిపో అధికారులు డిపో ఉద్యగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీబీపేట మండలంలో రోడ్డు భద్రతపై అవగాహన

కామారెడ్డి, మార్చ్ 31, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా బిగి పేట మండలం ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ గ్రామాల్లో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని బీబీపేట ఎస్ఐ కొండ విజయ్ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ఓవర్ స్పీడ్ చేయకుండా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ ప్రజలు, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.

# సహకార సంఘం అభివృద్ధికి సభ్యుల సహకారం ఎంతో అవసరం

-సంఘం ఇంచార్జ్ యాకూబ్ అలీ

వెల్దుర్తిమండల ప్రతినిధి, మార్చ్ 31 (తెలంగాణ పత్రిక):





వెల్దుర్తి సహకార సంఘం అభివృద్ధికి సభ్యుల సహకారం ఎంతో అవసరమని సహకార సంఘం ఇన్చార్జి యాకుబ్ అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో సహకార సంఘం ఇన్చార్జి యాకూ అలీ అధ్యక్షతన సహకార సంఘ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాకోబు అలీ మాట్లాడారు. వెల్దుర్తి పిఎసిఎస్ వార్షిక మహాజన సభ సహకార సంఘ సభ్యుల ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటివరకు సహకార సంఘం ఆధ్వర్యంలో 47 సార్లు పాలకవర్గ వార్షిక మహాసభ నిర్వహించినట్లు తెలిపారు. రెండోసారి సంఘం పాలన వ్యవహారాల్లో పాల్గొని సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పిఎసిఎస్ సీఈవో అశోక్ కుమార్ మాట్లాడారు. సంఘంలో 438 మంది సభ్యులకు 11 కోట్ల 7 లక్షల స్వల్పకారిక రుణాలు, 18 మందికి ఒక కోటి 37 లక్షల దీని యొక్క దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు సంఘ సభ్యులకు చదివి వినిపించారు. సంఘం ద్వారా వివిధ కంపెనీలతో మాట్లాడి ఎరువులను దిగుమతి చేసుకొని రైతులకు ఎరువులతో పాటు విత్తనాలను అందించడం జరిగిందన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో 18 కొనుగోలు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి 6540 మంది రైతుల నుండి 31, 13, 751, 60 క్వింటల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం కూడా జరిగిందన్నారు. తాజా మాజీ చైర్మన్ తిరుమల అనంతరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన పదవి కాలంలో నాబార్డ్ ద్వారా కొన్ని కేంద్రాల వద్ద గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అవి మంజూరు అయ్యాయని త్వరలో పనులను ప్రారంభించి రైతులకు అందుబాటులోనికి తీసుకురావాలని పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

# శిరుసనగండ్ల జాతరలో 'మద్యం' విందు.. పవిత్రతకు తిలోదకాలు

- బ్రహ్మోత్సవాల వేళ జోరుగా అక్రమ విక్రయాలు
- అబ్కారీ శాఖ చర్యలు తూతూ మంత్రం'
-చారకొండలో వైన్స్ లో అధిక ధరల దందా.. పట్టించుకోని అధికారులు

తెలంగాణ పత్రిక మార్చ్ 31


చారకొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శిరుసనగండ్ల శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల పవిత్రత అక్రమ మద్యం విక్రయాలతో మంటగలుస్తోంది. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని బెల్ట్ షాపుల నిర్వాహకులు, మద్యం మాఫియా విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నా.. పర్యవేక్షించాల్సిన అబ్కారీ శాఖ అధికారులు నామమాత్రపు చర్యల తీసుకోవడంతో ఉత్సవాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల తీరుపై విమర్శలు. శిరుసనగండ్ల శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో మద్యం విక్రయాలపై ఈ నెల 28న వివిధ దినపత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన అబ్కారీ అధికారులు కేవలం 'తూతూ మంత్రం'గా దాడులు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. వార్త దిన పత్రికలో ప్రచురితమైన ఫొటోలో కనిపించిన ఒక్క వ్యక్తిపై మాత్రమే కేసు నమోదు చేసి, అసలు సూత్రధారులైన వైన్స్ యజమానులను వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దోపిడీ పర్వం: ఎంఆర్పీ కంటే రూ. 35 అదనంగా వసూలు! మండల కేంద్రంలోని వైన్ షాపుల్లో మద్యం విక్రయాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తూ సామాన్యులను దోచుకుంటున్నారు. తాజాగా ఓ వినియోగదారుడు రాయల్ స్టాక్ క్వార్టర్, బడ్వైజర్ టిన్ తీసుకున్నాడు.. రాయల్ స్టాక్ క్వాటర్ కు రూ. 220, బడ్వైజర్ టిన్ కు రూ.. 190 ఏంఆర్పీ ఉండగా మొత్తం రూ.410 తీసుకోవాల్సిన వైన్స్ సిబ్బంది ఒక్కో బాటిల్ పై రూ. 35 అదనంగా వసూలు చేయడం గమనార్హం. సదరు వ్యక్తి ఫోన్ పే ద్వారా రూ. 480 చెల్లించిన తర్వాత, ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని నిలదీయడంతో మౌనం వహించిన సదరు సిబ్బంది.. 16 నిమిషాల తర్వాత ఆ రూ. 70 తిరిగి ఫోన్ పే చేశారు. అంటే, ప్రశ్నించిన వారికి ఒక ధర, ప్రశ్నించని వారికి మరో ధరతో దోపిడీ సాగుతోంది. సమయం ముగిసినా ఆగని విక్రయాలు.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాపులు రాత్రి 10 గంటలకు మూసివేయాల్సి ఉంది. కానీ చారకొండలోని వైన్స్ సమయం దాటినప్పటికీ, గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి వేళల్లో సైతం ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సిండికేట్‌గా మారి అక్రమాలకు పాల్పడుతున్న వైన్స్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, జాతర పవిత్రతను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దాడులు నిర్వహించి కేసు నమోదు చేశాం. శిరసనగండ్ల జాతరలో మద్యం విక్రయాలు జరుగుతుండటంతో దాడులు నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేశాం.. చారకొండ వైన్స్ లో ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం అమ్మితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వివేక్, అబ్కారీ ఎస్సై.

# గ్యాస్ట్రిక్ నివారణకు ఆహారపు అలవాట్లు, జీవన ప్రమాణాలే ముఖ్యం

-యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఏంటరాలజీ వైద్యులు శ్రీరామ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 31,(తెలంగాణ పత్రిక)




గ్యాస్ట్రో ఏంటరాలజీ సమస్యలను పరిష్కరించడంలో యశోద హాస్పిటల్ లో మల్టీ డిసిప్లినరి విధానం ద్వార తక్కువ ఖర్చుతో చికిత్స అందించడం జరుగుతుందని, ముఖ్యంగా అహరపు అలవాట్లు, జీవన ప్రమాణాల ద్వారనే గ్యాస్ట్రిక్ సమస్యలను నివారించవచ్చని సోమాజిగూడ యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఏంటరాలజీ వైద్యులు శ్రీరామ్ శ్రీకాకులపు అన్నారు.మంగళవారం మంచిర్యాల పట్టణంలోని నార్త్ ఇన్ హోటల్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా నుండి సోమాజిగూడ లో గల యశోద హాస్పిటల్ లో అత్యాధునిక గ్యాస్ట్రో ఎంటరాలజీ చికిత్సలను పొందుతున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో పేషెంట్లకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని ఇప్పటికే అనేకమైనటువంటి చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈమధ్య క్రానిక్ పాంక్రియాటైటిస్తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలిక గత కొన్ని నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో ఇబ్బంది పడుతుందని, పూర్తి పరీక్షల తర్వాత ఈ ఆర్ సి పి ప్రక్రియ ద్వారా పాంక్రియాటిక్ సెట్టింగ్ చేయడం జరిగిందని, గత ఆరు నెలలుగా ఎలాంటి నొప్పి లేకుండా ఆరోగ్యం వంతంగా జీవనం గడుపుతోందన్నారు. అంతేకాకుండా 75 ఏళ్ల వృద్ధుడు కాలేయ వ్యాధితో తీవ్రమైన రక్తపువాంతులతో ఆస్పత్రిలో చికిత్స కోసం రావడం జరిగిందని, అత్యవసర మెడికల్ టీం వెంటనే ఎండోస్కోపి నిర్వహించి, రక్తస్రావాన్ని అరికట్టడం జరిగిందని, దీంతో కేవలం గంటల వ్యవధిలోనే ఆ వ్యక్తి పరిస్థితి మెరుగుపడిందన్నారు. అనంతరం రెండు రోజుల తర్వాత హాస్పిటల్ నుండి డిశ్చార్ చేయడం జరిగిందన్నారు. పేషంట్లకు మెరుగైన చికిత్స అందించడంలో భాగంగా ప్రతినెల మంచిర్యాలలో రోగులకు ఫాలో ఆఫ్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. దీంతో ప్రతిసారి హైదరాబాదుకు రావలసిన అవసరం లేకుండా ఇక్కడే నాణ్యమైన చికిత్సను పొందుతున్నారని తెలిపారు. రోగులకు కేవలం చికిత్స అందించడమే కాకుండా వారి దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మరియు జీవన ప్రమాణాలను పెంపొందించడమే తమ లక్ష్యం అని వైద్యులు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ గిరెడ్డి సుధీర్ రెడ్డి,పొన్నాల రాజు పాల్గొన్నారు.

# బోధన్ పట్టణంలో హనుమాన్ జయంతి ఆర్గనైజర్లతో సమన్వయసమావేశం

తెలంగాణ పత్రిక్ రిపోర్టర్ మోహన్ బోధన్ మార్చి 31.




బోధన్ పట్టణంలో హనుమాన్ జయంతి నిర్వహణ సందర్భంగా బోధన్ లయన్స్ క్లబ్ యందు ఈరోజు మంగళవారం ఉదయం సిపి సాయి చైతన్య మాట్లాడుతూ హనుమాన్ జయంతి శోభాయాత్ర ర్యాలీ వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ ర్యాలీలో మేము నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని క్షుణంగా చర్చించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీ భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఇతరులకు హనుమాన్ స్వాములు చాలా భక్తిశ్రద్ధలతో ఈ ర్యాలీ నిర్వహించుకోవాలని ఆయన అన్నారు ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా వ్యతిరేకిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ఈ సంవత్సరం కూడా జరుపుకోవాలి గత సంవత్సరం తీసుకెళ్లి రూట్ లోనే ఇప్పుడు కూడా తీసుకువెళ్లాలి కొత్త రూట్లో తీసుకు వెళ్ళకూడదు అన్నారు నిర్వాహకులు తప్పనిసరిగా వాలంటీర్లను నియమించుకోవాలి ముందుగానే వాలంటీర్లకు సూచనలుఇవ్వాలని అన్నారు సిస్టం పూర్తిగా నిషేధం తెలియజేశారు డ్రోన్ల వాడకం నిషేధమని తెలియజేశారు సమావేశంలో ర్యాలీ ఆర్గనైజర్లు వారి సందేహాలు సలహాలను సీపీ. సాయి చైతన్య స్వీకరించారు ఈ సమావేశంలో ఏసీపీ. శ్రీనివాస్ టౌన్ ఎస్ హెచ్ వెంకటనారాయణ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం సిఐలు ఎస్ఐలు మరియు హిందు ధర్మ ప్రచార మండలి ప్రవీణ్ గుప్తా ఆర్గనైజేషన్ గోపి విశ్వహిందూ పరిషత్ శ్రీహరి కృష్ణారెడ్డి మారుతి మంజీరా పూజారి ప్రవీణ్ మహారాజ్ బజరంగ్దళ్ ఆర్య సమాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు







**-విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సదుపాయాలపై నిర్లక్ష్యం సహించబోము.**
**-జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 31

జూలూరుపాడు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఒ జూనియర్ కళాశాల, అలాగే పడమటి నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా స్థాయి, ఆహార నాణ్యత, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతులు, పరిపాలనా వ్యవస్థపై సమగ్రంగా పరిశీలించారు. మొదటగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఎనిమిదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు తీసుకుంటున్న టిఫిన్, భోజన నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని నిర్ధారించుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాన్ని చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ పూర్తిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ, బీట్‌రూట్ వంటి కూరగాయలు అందించకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన, తాజా కూరగాయలతో ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు చేతులు శుభ్రపరచుకునే ప్రదేశంలో ట్యాపులు లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంపై వివరణ కోరారు. పాఠశాలలో గ్యాస్ సదుపాయం, సిలిండర్ల లభ్యత, వంట సిబ్బంది సంఖ్య, నెలవారీ వ్యయాలపై వివరాలు తెలుసుకున్నారు. పనిచేయకుండా ఉన్న ఆర్.ఓ ప్లాంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్కువ వ్యయంతో మరమ్మతులు చేయవచ్చని ఉన్నప్పటికీ బయట నుంచి నీటి సరఫరా కొనసాగించడం ఎందుకని ప్రశ్నించారు. అనవసర ఖర్చులను తగ్గించి నిర్వహణ నిధులను విద్యార్థుల సౌకర్యాల కోసం వినియోగించాలని సూచిస్తూ, ఒక వారం రోజుల్లో ఆర్.ఓ ప్లాంట్‌ను మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరుకుల సరఫరా విధానం, ఏఎన్ఎం అందుబాటు, రాత్రి డ్యూటీ సిబ్బంది వివరాలు, డ్యూటీ షెడ్యూల్, విద్యార్థుల టైమ్ టేబుల్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ పాఠశాలలో 166 మంది విద్యార్థులు, జూనియర్ కళాశాలలో 92 మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. అనంతరం పడమటి నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి ఏడవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాలలో మొత్తం 450 మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయులు సుభద్ర తెలిపారు. భోజనశాల, కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను పరీక్షించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలను పరిశీలించిన సమయంలో దుర్వాసన రావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన కూరగాయలను వెంటనే తొలగించాలని ఆదేశిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వంటకు నాణ్యమైన, తాజా కూరగాయలనే వినియోగించాలని స్పష్టం చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న బియ్యం తదితర సరుకులను పరిశీలించి వాటి నాణ్యతపై విచారణ చేశారు. ఆర్.ఓ ప్లాంట్‌ను పరిశీలించి తాగునీటి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు యూనిఫార్ములు, నైట్ డ్రెస్సులు, స్పోర్ట్స్ డ్రెస్సులు సమయానికి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్, అవి వినియోగంలో లేకపోతే ఎందుకు ఉంచారో ప్రశ్నించారు. కేవలం అలంకారంగా ఉంచడానికేనా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాటిని వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని లేదా అవసరం లేకపోతే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, “విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం తప్పనిసరిగా అందించాలి. పాఠశాలల్లో శుభ్రమైన త్రాగునీరు, పరిశుభ్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదు. పనిచేయని ఆర్.ఓ ప్లాంట్లు, బయోమెట్రిక్ యంత్రాలను అలాగే ఉంచడం సరైంది కాదు. ఇవి అలంకారానికి కాదు... వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి లేదా తొలగించాలి. అనవసర ఖర్చులను తగ్గించి విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధికి నిధులు వినియోగించాలి. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి” అని స్పష్టం చేశారు. ఇతనికిలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**-జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**
**-ర్యాలీ రూట్ మ్యాప్ పరిశీలన అధికారులకు కీలక ఆదేశాలు**



కామారెడ్డి, మార్చి 31, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)


శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కామారెడ్డి జిల్లా ప్రజలను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ లు కోరారు . ఏప్రిల్ 02న హనుమాన్ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ సాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించిన వారు, మార్గంలోని ప్రధాన కూడళ్ల ను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ , బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేడుకలను క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ లు మాట్లాడుతూ, పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు , సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు , నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎస్.హెచ్.ఓ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ , ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


**-పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

ఆత్మకూర్, మార్చి 31: (తెలంగాణ పత్రిక):

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ ధ్యేయమని రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో దామెర ,ఆత్మకూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 33 మంది లబ్ధిదారులకు రూ.33,03,828 . కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయగా, మరో 66 మంది లబ్ధిదారులకు రూ.24,43,000 . ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. పరకాల నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,797 మందికి రూ.28,00,24,452 విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించామని, అలాగే 2,684 మందికి రూ.9,06,07,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, రేవూరి జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రేవూరి జయపాల్ రెడ్డి తనుగుల సందీప్ , అల్వాల రవి ,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



ముధోల్:31మార్చ్(తెలంగాణ పత్రిక)

ఆపదలో ఉన్నవారికి సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సహాయం కింద చెక్కులను అందజేస్తున్నారని ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భోస్లే నారాయణరావు పటేల్ చెప్పారు. మంగళవారం బైంసా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అష్ట సర్పంచ్ రావుల శ్రీనివాస్ లు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు.ముధోల్ మండలంలోని అష్ట గ్రామానికి చెందిన బొంగు సాయిలు రూ.60వేలు, బొంత మమత రూ.30వేలు, గంగా బాయి రూ.32500, మెరుగు కృష్ణారెడ్డి రూ.15వేలు, సునీత కు రూ.25వేల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ఎంతో అండగా నిలుస్తుందన్నారు. సీఎం సహాయనిది చెక్కుల మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్, జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సావిత్ర కోటయ్య, యువ నాయకులు లోలం మురళి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటు భక్తిరసంలో మునిగిన కీసర గ్రామం

**-పిండిదీపాలతో అమ్మవారికి విశేష ఆరాధన**
**-మహిళల భక్తిశ్రద్ధలే ఉత్సవాల ప్రధాన ఆకర్షణ**
**-తమిళ సంప్రదాయంతో తెలంగాణలో బోనాల తరహా వేడుకలు**
**-అమ్మవారి కటాక్షం కోసం భక్తుల మొక్కులు**
**-రాగిజావ నైవేద్యంతో ప్రత్యేక ఆకర్షణగా తిరువిలా**
**-ప్రాంతమంతా పండుగ వాతావరణం సంబరాల్లో ప్రజలు**
**-ధర్మ పరిరక్షణపై ప్రముఖుల పిలుపు**
**-భక్తి, సంప్రదాయం కలగలిపిన మావువిలక్ తిరువిలా**

,కీసర మండలం మార్చి31, (తెలంగాణ పత్రిక)

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర మండలంలోని కీసరగుట్ట అడవి ప్రాంతంలో కొలువైన కరుమరియమ్మన్ ఆలయం, అలాగే కీసర గ్రామంలోని స్నేహ కాలనీలోని కరుమరియమ్మన్ ఆలయాల్లో వార్షిక మావువిలక్ తిరువిలా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాలతో మొత్తం ప్రాంతం పండుగ వాతావరణంలో కళకళలాడింది. ఈ ఉత్సవాలకు ఆర్ఎస్ఎస్ సాంగ్ ధర్మ ప్రచారక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని, హిందూ ధర్మ విశిష్టత, సంస్కృతి పరిరక్షణ అవసరంపై ప్రాసంగించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులు కూడా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి ఉత్సవ నిర్వాహకులు పూలమాలలు, సాలువాలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నారికేళ నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అమ్మవారి కటాక్షంతో కీసర గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఇంట్లో శాంతి, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ, తమిళనాడులో విస్తృతంగా జరుపుకునే మారియమ్మన్ మావువిలక్ తిరువిలా, తెలంగాణలో బోనాల పండుగల తరహాలోనే భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. మారియమ్మన్ అంటే గ్రామదేవత (పోచమ్మ), మావువిలక్ అంటే పిండితో తయారు చేసే దీపం, తిరువిలా అంటే ఉత్సవం అని వివరించారు. ప్రతి సంవత్సరం పాల్గుణం లేదా చైత్రమాసంలో ఈ వేడుకలు నిర్వహించబడతాయని తెలిపారు.



ముఖ్యంగా మహిళలు తయారు చేసే పిండిదీపాలు ఈ ఉత్సవానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు ఈ దీపాలను అమ్మవారికి సమర్పిస్తూ తమ కోరికలను కోరుకుంటారు. అదేవిధంగా, చైత్రమాసంలో ఉండే ఎండల తీవ్రత నుంచి రక్షణ కలగాలని కోరుతూ కొంతమంది భక్తులు రాగి పిండితో తయారు చేసిన రాగిజావను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ఈ ఉత్సవానికి ప్రత్యేకతగా నిలుస్తుంది. ఉత్సవ ముఖ్య నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ వేడుకలు ప్రతి సంవత్సరం మరింత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు..

# మాజీ జెడ్పిటిసి మృతికి పిసిసికార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి నివాళులు

కామారెడ్డి, మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాచారెడ్డి మండల మాజీ జడ్పిటిసి సభ్యురాలు గ్యార లక్ష్మి మృతి చెందడంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం ఆమె స్వగ్రామం పోతారం గ్రామానికి వెళ్లిన ఆయన, గ్యార లక్ష్మి పార్తివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గ్యార లక్ష్మి జడ్పిటిసి సభ్యురాలిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మనస్సుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, పంపరి లక్ష్మణ్, కౌన్సిలర్ తాటి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జమిల్, జూలూరి సుధాకర్, చాట్ల వంశీ, సాయిబాబా, నాయకులు రాజశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతను ఉపయోగించి జల చరాలపై వ్యవస్థాత్మక అధ్యయనం చెయ్యాలి

**-సైన్స్ డీన్ ప్రో. సంపత్ కుమార్**


కామారెడ్డి ,మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ఆధునిక సాంకేతికతను ఉపయోగించి జలచరాలపై లోతైన అధ్యయనం జరగాలని తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ అన్నారు.తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ లో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జల చరాల జీవ వైవిధ్యం,వాటి సంరక్షణ, వ్యవస్థాత్మక అధ్యయనం అనే అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ వర్క్ షాప్ లో జల చరాల జీవ వైవిధ్యం,ప్రభావాలు గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు.పర్యావరణ సమతుల్యతలో జల చరాల పాత్ర కూడా ఉంటుందని అన్నారు. ఇంకా ఈ కార్యశాలలో పాల్గొన్న సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా.సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ జల చరాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ఆధునిక పరిశోధనా పద్ధతులు,జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు ఈ కార్యశాల అవగాహన కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ వైపుగా విద్యార్థులు చర్చల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జువాలోజి విభాగం హెడ్ డా.ప్రసన్న శీల, అధ్యాపకులు డా.సునీల్, విజయ్ కుమార్, శ్రీకాంత్ వివిధ విభాగాల అధ్యాపకులుడా. ప్రతిజ్ఞ, డా.హరిత, డా.మోహన్ బాబు, డా.ఇంద్రకరణ్, డా.కనకయ్య, డా.అఫ్రీన్, డా.కిషన్, డా.శ్రీనివాస్, డా.పోతన్న, డా.మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో గర్భిణీ మహిళకు రక్తదానం చేసిన రామచందర్ రావు

**-ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**




కామారెడ్డి ,మార్చి 31, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన స్రవంతి (28) గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుండడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాత బూరుగుపల్లి రామచందర్ రావు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ప్రతిరోజు రాష్ట్రవ్యాప్తంగా వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారు రక్తం అవసరమని సంప్రదిస్తున్నారని వారికి కావలసిన రక్తాన్ని అందజేయడం కోసం నిరంతరాయంగా పనిచేస్తున్నామని అన్నారు, ప్రస్తుతం వేసవికాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు తగ్గిపోవడం జరిగిందని, ప్రతి సంవత్సరం రెండుసార్లు రక్తదానం చేసే రక్తదాతలకు గుండె జబ్బు,క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఎన్నో నివేదికలు తెలియజేయడం జరిగిందని అన్నారు. రక్తదానానికి సహకరించిన సామర్థ్యం నందు,రక్తదాత రామారావుకు పేషంట్ బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇల్లంతకుంట సహకార సంఘానికి ఎఫ్‌సీఓ గుర్తింపు

ఇల్లంతకుంట మార్చి 31 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇల్లంతకుంట ప్యాక్స్ ఇన్‌చార్జి రాజేంద్ర ప్రసాద్, కేడీసీసీబీ మేనేజర్ ప్రవీణ్ కుమార్, సీఈఓ రవీందర్ రెడ్డి హాజరయ్యారు. రైతుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం బడ్జెట్, లావాదేవీలు, ఖర్చుల వివరాలను వెల్లడించారు.అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చించారు. ఆయిల్ పామ్ పంటలు సాగు చేయదలచిన రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు సంఘ సభ్యత్వం కోసం 2000 రూపాయలు కట్టి సంఘములు నెంబర్ షిప్ తీసుకోవాల్సిందిగా తెలిపారు,రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 24 సహకార సంఘాలు ఉండగా, అందులో 6 సంఘాలు ఎఫ్‌సీఓ గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఆ గుర్తింపు పొందిన సంఘాల్లో ఇల్లంతకుంట సహకార సంఘం కూడా ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో ఆర్థిక స్వావలంబన







**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో 10 వేల కోట్లు మహిళలు చార్జీలు ఆదా చేసిన సందర్భంగా వేడుకలు**
**-పలువురు మహిళలకు ఉచిత బస్సు టికెట్ అందించిన కలెక్టర్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31, తెలంగాణ పత్రిక

ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగ పడుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి రెండేండ్లకుపైగా పూర్తి అయి 290 కోట్ల ప్రయాణాలు మహిళలు చేయగా, రూ.10 వేల కోట్లు ఆదా చేసిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు మహిళలకు ఉచిత బస్ టికెట్ అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల సేవలు నిత్యం వినియోగిం చుకుంటున్న పలువురు మహిళలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలు, సంక్షేమ ఫలాలు వారి పేరిట, వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు డిసెంబర్ 9వ తేదీ 2023 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే మహిళలు డబ్బులు ఆదా చేసుకొని, వాటిని పిల్లల చదువు, స్వయం ఉపాధి, పొదుపు వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పథకం దోహదం చేస్తుందని, బస్సుల్లో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ పథకాలు మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని తెలిపారు. చీరలు మన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతు పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. బ్యాంక్ లింకేజ్ రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డీఎంలు ప్రకాశరావు, శ్రీనివాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదు

**-బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కాలువను పూర్తిగా తీసే గతి లేక**
**-సుమారు 300 ఎకరాలను ఎండబెట్టిన ఘనత నీదని మాజీ ఎమ్మెల్యే పెద్ది పై నిప్పులు చెరిగారు**
**-రైతులపై కపట ప్రేమ చూపిస్తున్న మీకు రైతులే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించిన**
**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి**

నల్లబెల్లి మార్చి 31 తెలంగాణ పత్రిక



నల్లబెల్లి మండలకేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధర్నా చేయడం సిగ్గు చెటు ,రంగయ్య చెరువు రిజర్వాయర్ ద్వారా నల్లబెల్లి దుగ్గొండి నర్సంపేట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని లక్ష్యంతో రిజర్వాయర్ తీసుకువస్తే మాధవ రెడ్డి రైతుల వద్ద మంచి పేరు వస్తుందని ఉద్దేశంతో ఆనాడు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో కిరాగానే రీడిజన్ పేరుతోటి ప్రాజెక్టును రద్దుచేసి ఒక ఎకరానికి కూడా నీరు అందియకుండా రైతులను మోసం చేసిన చరిత్ర నీది, మాధవ రెడ్డి రిజర్వాయర్ పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ఉంటే మీ ఊళ్లు మునుగుతాయని అమాయక ప్రజల వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పి ప్రజలను ఉసిగొలిపిన చరిత్ర నిధి ఒక్క పంట కాలువ కూడా పూర్తి చేయకుండా ఆసంగి పూర్తిగా వదిలేసి నీళ్లు ఇవ్వకుండా ధర్నా చేస్తున్న దద్దమ్మలు మీరని నిప్పులు చెరిగారు, కాల్వ వద్దకు వెళ్లి ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప రైతులకు ఒరగాపెట్టింది ఏమీ లేదు గతంలో రంగయ్య చెరువు కాలువను పూర్తిగా తీసే గతిలేక సుమారు 300 ఎకరాలను ఎండబెట్టిన ఘనత నీదని దుయ్యపట్టారు..... మాధవ రెడ్డి ఎమ్మెల్యే గెలిచిన వెంటనే రైతులకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో రెండు పర్యాలు చివరి ఆయకట్టు దాకా కాల్వ పుటిక తీయించి రైతులకు నీరు అందించడం జరిగినది అధికారం పోయిన వెంటనే రైతుల వద్దకు వెళ్లి కపట ప్రేమ చూపిస్తున్న మీకు రైతులే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు...ఈ సమావేశం లో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాలఅశోక్, మాజీ మండలం అధ్యక్షులు ఎర్రబెల్లి రఘుపతి రావు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ చరణ్ సింగ్, మండలకార్యదర్శి జిల్లా మునందర్ జెట్టి రామూర్తి, ఉపాధ్యక్షులు కొంరరెడ్డి, ఎస్ టి సెల్ మండలం అధ్యక్షులు పోగుల బాహు సింగ్, గ్రామ సర్పంచ్ లు భాస్కర్, అనిత శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు జంగిలి మోహన్, వెంగళదాసు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల కుమారస్వామి, వైనాలపవన్, బత్తిని మల్లయ్య, మాజీ సర్పంచ్ ఎరుకల రవీందర్, పెంతల కుమార్, గుగులోత్ రఫీద్ నాయక్ మోర్తాల మనోహర్, రాజేంద్రప్రసాద్, గద్దల సురేష్, వడ్లూరి రమేష్, కుంచాల రాజు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఉత్తమ సేవలు అందించాలి





**-కలెక్టర్ గరిమ అగ్రవాల్న్**
**-పారిశుధ్య పనులు నిత్యం చేయించాల్ని**
**-పన్నులు 100 శాతం వసూలు చేయించాల్ని**
**-సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ హాజర్న్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31, తెలంగాణ పత్రిక

సిరిసిల్ల నూతన మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో మంగళవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులందరికీ అభినందనలు తెలియజేసారు.బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారిశుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాప్ లు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపాలిటీకి చెందిన ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులు అద్దెకు ఇచ్చేందుకు మరోసారి టెండర్లు పిలువాలని ఆదేశించారు.ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. పార్క్ లు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. కొత్త చెరువులో మరమ్మత్తు పనులు వేగంగా చేయించాలని, ప్రజలు, పిల్లలు వచ్చేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. డీఆర్‌సీసీ కేంద్రం పక్కాగా నిర్వహిం చాలని, ఏబీసీ కేంద్రం వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సిరిసిల్ల ఖ్యాతి చాటేలా రగుడు జంక్షన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, త్వరలోనే వినియోగంలోకి రానున్నదని వెల్లడించారు. అమృత్ పథకం కింద తాగునీటి సమస్యకు పరిష్కారం రానున్నదని వివరించారు. తాగునీటి సమస్య రాకుండా వార్డు సభ్యులు, అధికారులు చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 31,(తెలంగాణ పత్రిక)





రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, ఆర్ టి సి మంచిర్యాల డిపో మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి అనితలతో కలిసి ఎ పి ఎం లు, డి పి ఎం లు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ద్వారా రాష్ట్రంలోని మహిళలకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికైనా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు నగదు పొదుపు జరుగుతుంని, తద్వారా ఆ నగదును కుటుంబ పోషణ నిమిత్తం వినియోగించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళల పేరిట పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 5 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రహరీ గోడ, వంటశాల, త్రాగునీరు, అదనపు గదులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా 16 బస్సులు వస్తున్నాయని, ఆర్ టి సి సంస్థకు లీజ్ కి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రాష్ట్రంలో ప్రథమంగా నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ భవన్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవచ్చు అని, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళను కుటుంబ పెద్దగా నిర్ధారించి అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులను మహిళల పేరిట జారీచేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు అన్ని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందే దిశగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ తాను గతంలో ఎక్కడికైనా వెళ్లాలి అంటే డబ్బుల గురించి ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా అందించిన ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లా కేంద్రానికి, బంధువుల ఇండ్లకు, పనుల నిమిత్తం వెళ్లేందుకు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లడంతో ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని తెలిపారు. జైపూర్ మండల కేంద్రానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తనకు సంవత్సరానికి దాదాపు 40 వేల రూపాయలు మిగులుతున్నాయని, రోజువారి పనిమీద తమ గ్రామం నుండి మంచిర్యాలకు వెళ్లాలంటే 100 రూపాయలు ఖర్చు అయ్యేదని, నెలలో 20 సార్లకు పైగా ప్రయాణం చేయవలసి ఉంటుందని తెలిపారు. తద్వారా నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆదా అవుతుందని, పని నిమిత్తంతో పాటు బంధువుల ఇండ్లకు, దేవాలయాలకు సంతోషంగా వెళుతున్నానని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా పొదుపు అయిన డబ్బులను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు సంఘంలో పొదుపు పెంపొందించుకుంటున్నానని తెలిపారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన లత ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తాను ఇప్పటివరకు 20 వేల రూపాయల వరకు లబ్ధి పొందానని తెలిపారు. శుభకార్యాలకు, షాపింగ్ కు, దేవాలయాలకు, పిల్లల ఆసుపత్రులకు, బంధువుల కార్యక్రమాలకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతతో పాటు వివిధ వ్యాపార రంగాలలో అందిస్తున్న ప్రోత్సాహంతో వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని, తద్వారా మరింత అభివృద్ధికి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబం కోసం సమయాన్ని కేటాయించాలి

**-రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**-ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులకు ఘన సన్మానం**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 31,(తెలంగాణ పత్రిక)



తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని,ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు తమ కుటుంబ సభ్యుల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను ఆయన ఈరోజు ఘనంగా సత్కరించారు.పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్ఐ అంజయ్య, ఏఎస్ఐలు ఎం. వెంకటస్వామి (1987), సయ్యద్ రాయిస్ అహ్మద్ (1851)లను పోలీస్ కమిషనర్ పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు తమ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,కొన్ని సందర్భాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించినవారని పేర్కొన్నారు.వీరు రేపటి తరం పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు.ఉద్యోగ విరమణ చేసిన అధికారులు తమ ఆరోగ్యం కోసం యోగ లేదా వ్యాయామాన్ని నిరంతరం కొనసాగిస్తూ,ఇకపై కుటుంబ సభ్యులతో సమయాన్ని గడిపి సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని సీపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐలు పెద్దన్న, మల్లేశం,రమేష్, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సందీప్,సంధ్య, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు





**-మంగపేట పోలీసులు**


**-పెట్రోల్ బంక్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం**

**-బాటిళ్లలో పెట్రోల్ పోయడం, మైనర్లకు ఫిల్లింగ్ చేయడంపై నిషేధం**

మంగపేట, మార్చి 31: (తెలంగాణ పత్రిక)

మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంక్ నిర్వాహకులతో మంగళవారం పోలీసులు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. బంకుల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించడం ప్రాథమిక బాధ్యత అని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలు అందించాలని సూచించారు. సమావేశంలోని ముఖ్య అంశాలు: సిసి కెమెరాల నిఘా: బంక్ లోపల, వెలుపల పరిసరాలన్నీ పూర్తిగా కవర్ అయ్యేలా అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మైనర్లకు విక్రయాల నిషేధం: ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు పెట్రోల్ పోయకూడదు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తప్పవు. బాటిళ్లలో పెట్రోల్ వద్దు: పెట్రోల్, డీజిల్‌ను కేవలం వాహనాల్లో మాత్రమే నింపాలి. బాటిళ్లు, డ్రమ్ములు లేదా విడి ట్యాంకర్లలో ఫిల్లింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధం. నో పార్కింగ్ జోన్: పెట్రోల్ బంకుల ముందు లారీలు, ఇతర వాహనాలను పార్కింగ్ చేయకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, నిబంధనలు అతిక్రమిస్తే బంక్ యజమానులు మరియు వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. కనీస సౌకర్యాలు: ప్రతి బంక్‌లో వినియోగదారుల కోసం స్వచ్ఛమైన తాగునీరు, ఎయిర్ ఫెసిలిటీ మరియు పరిశుభ్రమైన టాయిలెట్ సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలకు లోబడి, బాధ్యతాయుతంగా బంకులను నిర్వహించుకోవాలని పోలీసులు ఈ సందర్భంగా నిర్వాహకులను కోరారు.

## వేములవాడ ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం వైద్యులకు ప్రశంసల జల్లు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు తమ నైపుణ్యంతో ఒక క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు రొమ్ము గడ్డ సమస్యతో ఆసుపత్రికి రాగా, ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. ఆమెకు దీర్ఘకాలికంగా మధుమేహం (షుగర్) ఉండటమే కాకుండా, నోరు పూర్తిగా తెరవలేని శారీరక ఇబ్బంది కూడా ఉంది. సాధారణంగా ఇలాంటి కేసుల్లో 'జనరల్ అనస్థీషియా' (పూర్తి మత్తు) ఇవ్వడం ప్రమాదకరమని భావించి, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు రిఫర్ చేస్తుంటారు. కానీ, వేములవాడ ఆసుపత్రి మత్తు మందు నిపుణులు డా. తిరుపతి, డా. రాజశ్రీల సలహాతో, సీనియర్ సర్జన్ డా. పెంచలయ్య స్థానికంగానే ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు.వైద్య బృందం డాక్టర్లు మోహన్ కృష్ణ, అలేఖ్యలతో కలిసి 'సెగ్మెంటల్ థొరాసిక్ ఎపిడ్యూరల్ అనస్థీషియా' అనే అరుదైన మత్తు పద్ధతిని ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పద్ధతి ద్వారా రోగికి ప్రాణాపాయం లేకుండా, సురక్షితంగా గడ్డను తొలగించారు. అసాధ్యమైన ఆపరేషన్‌ను సుసాధ్యం చేసిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవీందర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, గతంలో లాగే సాధారణ కాన్పులు మరియు సంక్లిష్టమైన ఆపరేషన్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆపరేషన్‌లో పాల్గొన్న ఇతర వైద్య సిబ్బందికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పెద్ద రథం పైన భక్తుల మధ్యలో రాములోరి ఊరేగింపు

**-ఇలాంటి ఆటంకాలు జరగకుండా జాగ్రత్తపడ్డ పోలీస్ సిబ్బంది**





తెలంగాణ పత్రిక మార్చి 31

నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరిసనగండ్ల అయోధ్య నగర్ పైన గుట్ట సమీపంలో సీతారామచంద్రస్వామి ఆలయ జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రోజున తెల్లవారుజామున 5:00 గంటలకి లక్షలాది మంది భక్తుల మధ్యలో ఆలయ చైర్మన్ దేరం శర్మ కార్య నిర్వహణ అధికారి స్వర్గం ఆంజనేయులు మేనేజర్ నిరంజన్ ఆధ్వర్యంలో పురోహితుల మధ్యలో సీతారామచంద్రస్వామి పెద్ద రథం పైన ఊరేగింపు చేశారు. భక్తుల మధ్యలో జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ భక్తులు పెద్ద రథం మహోత్సవం లో సీతారామచంద్ర ఊరేగింపు కార్యక్రమంలో అధిక సంఖ్యలో రత తాడు లాక్కుంటూ రామభక్తులు పాల్గొన్నారు. సిరిసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయం దక్షిణ తెలంగాణలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన దేవస్థానం. ప్రతి ఏడాది శ్రీరామనవమికి సీతారామచంద్ర స్వామి కళ్యాణం తో పాటు పది రోజులపాటు జాతర బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ సంవత్సరం రత మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారామచంద్రస్వామి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేసి వారి మొక్కలను నెరవేర్చుకున్నారు .ఈ సిరసనగండ్ల బ్రహ్మోత్సవాలకు భారీ భద్రత ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బంది ప్రజలకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆటంకాలు జరగకుండా పోలీస్ శాఖ పనిచేసింది. పోలీస్ శాఖకు, విద్యుత్ శాఖకు, ఆలయ చైర్మన్ దేరం రామశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

## దోమకొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలకు చెత్తబుట్టల పంపిణీ

కామారెడ్డి, మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత, ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కామారెడ్డి జిల్లాదోమకొండ ఫోర్ట్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దోమకొండ మండల లోనిఅంగన్వాడి కేంద్రాలకు చెత్త బుట్టలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, చెత్తను సరైన విధంగా పారవేయడం వంటి మంచి అలవాట్లను పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి గణేష్ యాదవ్ మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం మన సమాజ భవిష్యత్తుకు మూలస్తంభం. అంగన్వాడి కేంద్రాలు శుభ్రంగా ఉండటం ద్వారా పిల్లలలో మంచి ఆరోగ్య అలవాట్లు ఏర్పడతాయిఅని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుప్రియ,అంగన్వాడి సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర అమోఘం

-చల్లూరులో సీసీ కెమెరాలు ప్రారంభించిన అడిషనల్ డీసీపీ వెంకటరమణ
-సీసీ కెమెరాల నిర్వహణ మనందరి బాధ్యత
-అడిషనల్ డీసీపీ వెంకటరమణ

వీణవంక ప్రతినిధి , మార్చి 31( తెలంగాణ పత్రిక).

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాటనందిస్తాయని, ఒక్క సీసీ కెమెరా వెయ్యి మంది పోలీసులతో సమానమని కరీంనగర్ అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలో గ్రామస్థుల సహకారంతో రూ.1.90 లక్షలతో 13 సీసీ కెమెరాలు ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని, ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. నేరం జరిగినపుడు దాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పెద్ద పెద్ద నేరాలను కూడా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలంరినీ ఈ సందర్భంగా అభినందించారు. సీసీ



కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అనంతరం పోలీసు అధికారులను, దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డి, ఉపసర్పంచ్ ఫసియొద్దీన్, పాలకవర్గ సభ్యులు, నాయకులు ఎల్కపెల్లి లక్ష్మణ్, పొదిల రమేష్, తిరుపతి, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

-మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక భరోసా
-జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మార్చి 31

ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం – ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని,



వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు. "గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని



విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, ఆర్టీసీ డి.ఎం. రవిచందర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణ శివార్లలో విచ్చలవిడిగా ఛాయా హోటల్స్

-సిగరెట్, గంజాయి పొగతో కలుషితమవుతున్న నివాస ప్రాంతాలు
-పోలీసుల నిఘా లోపం యువత భవిష్యత్తుపై ముప్పు

తెలంగాణ పత్రిక బ్యూరో,తెలంగాణ పత్రిక, మార్చ్ 31:

జగిత్యాల పట్టణంలో నివాసాల మధ్యలోనే ఉన్న వివిధ చాయ్ హోటల్స్ నుంచి వస్తున్న సిగరెట్, గంజాయి పొగ వాసనను తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. జగిత్యాల పట్టణ శివార్లలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఛాయా హోటల్స్ విస్తరిస్తున్నాయి. ఈ హోటల్స్‌లో సిగరెట్, గంజాయి సేవించడం నియంత్రణ లేకుండా జరుగుతుండటంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో గంజాయి పొగ ఎక్కువగా వ్యాపించి, కుటుంబాలతో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మరో ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ హోటల్స్‌లో మైనర్లకు కూడా అధిక సంఖ్యలో సిగరెట్లు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల చిన్న వయస్సులోనే వారు సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇది యువత భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పట్టణ పోలీసుల నిఘా వ్యవస్థ బలహీనంగా ఉందని, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడం




లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.నిఘా లోపంతో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని వారు అంటున్నారు. ఇలాంటి అక్రమ హోటల్స్‌పై తక్షణమే చర్యలు తీసుకుని, మైనర్లకు మత్తు పదార్థాల విక్రయాన్ని అరికట్టాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ఔషధ భద్రతపై పరిశోధన - గీతం స్కాలర్ కు పీహెచ్.డీ

పటాన్చెరు నియోజకవర్గం మార్చి 31 తెలంగాణ పత్రిక

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి జె. వెంకట రమణా రెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'విశ్లేషణాత్మక పద్ధతుల ద్వారా ఔషధ పదార్థాలలో జన్యు విష మలినాలను అంచనా' వేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమణారెడ్డి చేసిన పరిశోధన, ఫార్మాస్యూటికల్ సమ్మేళనాలలో అతి తక్కువ స్థాయిలో ఉండే జన్యు విషపూరిత మలినాలను -- అంటే డీఎన్ఏను దెబ్బతీసి, తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే పదార్థాలను -- గుర్తించడానికి, అధునాతన, సున్నితమైన, తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుందని వెల్లడించారు. ICH M7 మార్గదర్శకాల వంటి ప్రపంచ నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా, ఈ అధ్యయనం ఆర్మోడాఫినిల్, కోలెసెవెలామ్ హైడ్రోక్లోరైడ్ వంటి కీలక ఔషధాలను విశ్లేషించడానికి గ్యాస్ క్రోమాటోగ్రఫీ– మాస్ స్పెక్ట్రోమెట్రీ (జీసీ–ఎంఎస్), అయాన్ క్రోమోటోగ్రఫీ (ఐసీ) వంటి అధునాతన పద్ధతులను వినియోగిస్తుందని తెలియజేశారు. ఈ పరిశోధన అత్యున్నత కచ్చితత్వం, విశ్వసనీయతను నిర్ధారిస్తూనే, సరళమైన, పర్యావరణ హితమైన పద్ధతులకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ అధ్యయనం ఔషధ నాణ్యత నియంత్రణను గణనీయంగా బలోపేతం చేస్తుందని, ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన ఔషధ అభివృద్ధి పద్ధతులకు దోహదపడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ వెంకట రమణా రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్



వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏప్రిల్ నెలలో ఒకేసారి 3 నెలల రేషన్ బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు

భిక్కనూరు మార్చి 31 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)



భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ( పి.డి.ఎస్) ద్వారా ఉచితంగా ప్రతినెల ఇస్తున్నటువంటి రేషన్ బియ్యం పంపిణీ ఏప్రిల్ నెలలో 3 నెలలకు సరిపడా బియ్యం రేషన్ కార్డు వారికి(ఏప్రిల్, మే,జూన్) ఏప్రిల్ ఒకటి నుండి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఏప్రిల్ నెలలోనే తమ మూడు నెలల కోటాను సేకరించుకోవాలని మండల రెవెన్యూ అధికారి తహసిల్దార్ సునీత దేవి తెలిపారు,ఈక్రమంలో ఆర్,ఐ.కె బాలయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాళ్ల సతీష్ ముదిరాజ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

-పీఆర్ ముదిరాజ్ సేవా సమితి



నర్సంపేట/దుగ్గొండి/ మార్చి 31 తెలంగాణ పత్రిక

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, వెంకటాపురం గ్రామంలో ఇటీవల కాలంలో ట్రాక్టర్ ప్రమాదంలో అకాల మరణం చెందిన తాళ్ల సతీష్ ముదిరాజ్ కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి 10,000 ఆర్థిక సహాయం అందజేసింది. మండల అధ్యక్షుడు జట్టబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేయూత కార్యక్రమం ముదిరాజు సమాజంలో జాతి ఐక్యతకు దారి తీస్తుంది ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, ముదిరాజ్ మహాసభ నాయకులు ఓరుగంటి తిరుపతి మాట్లాడుతూ ఇంటి పెద్దలను కోల్పోయి అపత్కాలం లో ఉన్న నిరుపేద ముదిరాజు కుటుంబాలకు పీఆర్ ముదిరాజ్ సేవా సమితి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. వ్యవస్థాపక పెద్దలు పెసరు రాజన్న ఆదేశాల మేరకు ఇలాంటి చేయూత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, ముదిరాజ్ మహాసభ సీనియర్ నాయకులు ఓరుగంటి తిరుపతి, మండల అధ్యక్షులు జట్టబోయిన రాజేందర్, ఓరుగంటి అశోక్, పి రాజు మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన

-దుగ్గొండి తహసీల్దార్ ముస్కు సమ్మక్క



నర్సంపేట /దుగ్గొండి/ మార్చి 31 తెలంగాణ పత్రిక

ఇటీవలె నూతన బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ ముస్కు సమ్మక్క నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ వివిధ పనులపై దుగ్గొండి తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయంగా అందాల్సిన సేవలను అందించాలని, మండల ప్రజల మన్ననలను చూరగొనాలని ,మంచిపేరు తెచ్చుకోవడానికి మీదైన శైలిలో పనిచేయాలని,నీతి నిజాయితీ గా పనిచేసే అధికారులకు ఎక్కడైనా గుర్తింపు ఉంటుందని,ఎలాంటి ఇబ్బంది ఉన్నా మాదృష్టికి తీసుకురావాలని, అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

# హెగ్డోలీలో గాలికుంటు టీకాలు పంపిణీ

పోతంగల్ తెలంగాణ పత్రిక మార్చ్ 31.



పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో ఆవు,గేదె జాతి 3 నెలల పైన వయసు గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశువులకు టీకాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు,ఉప సర్పంచ్ సంజీవ్,పశు వైద్యులు డాక్టర్ సురేష్ కుమార్, స్థానిక గ్రామీణ బ్యాంకు మేనేజర్,సిబ్బంది సుధీర్ గౌడ్,అటెండర్లు భూమేష్, భాస్కర్, సతీశ్, గోపాల మిత్ర సాయిలు, రియాజ్, నగేష్, పశుమిత్ర రాజేశ్, పశు పెంపకందార్లు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కార్పొరేషన్ 59 వ డివిజన్ అంగన్వాడి సెంటర్లో "ఈసీసీఈ డే "నిర్వహణ

-దళిత రత్న అవార్డు గ్రహీత కవ్వంపల్లి సతీష్ గర్భిణీలకు మహిళలకు స్వీట్ల పంపిణీ.



గోదావరిఖని మార్చి 31 (తెలంగాణ పత్రిక ప్రతినిధి )

రామగుండం కార్పొరేషన్ 59 వ డివిజన్ లో ఈసిసిఈ డే కార్యక్రమం చేపట్టారు. రామగుండం కార్పొరేషన్ అశోక్ నగర్ లోని అంగన్వాడి సెంటర్లో ఈసిసిఈ డే కార్యక్రమం లో పాల్గొన్న కార్పొరేటర్ బాలసాని తిరుపతి గౌడ్ పెద్దపెల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కవ్వంపెల్లి సతీష్ కేక్ కటింగ్ చేసి పిల్లలకు గర్భిణీలకు మహిళలకు స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు అంగన్వాడి సెంటర్లలో భోజనం చేయడం చాలా మంచిదని ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడి సెంటర్ లో పిల్లలందరిని చేర్పించాలని పిల్లలను క్రమశిక్షణగా ఉంచుతూ గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం గురించి తెలియజేస్తున్న అంగన్వాడి టీచర్లను అభినందిస్తూ వారికి ఏ సహాయం కావాలన్నా కలెక్టర్ ద్వారా ఎమ్మెల్యే ద్వారా మేయర్ ద్వారా కార్పొరేషన్ ద్వారా అందేలా సహకరిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రమాదేవి మరియు గర్భిణీ స్త్రీలు పిల్లలు మహిళలు పాల్గొన్నారు.

## పోతంగల్ లో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పోతంగల్ తెలంగాణ పత్రిక మార్చ్ 31.

పోతంగల్ మండల కేంద్రంలోనీ పాత పోతంగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి మందిర విగ్రహ ప్రతిష్ఠాపన ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కేసరి రంగు కండువాలు ధరించి, జై శ్రీరామ్ నినాదాల మధ్య భారీ ఊరేగింపు చేపట్టారు. ఏప్రిల్ 2న విగ్రహ ప్రతిష్ఠాపన మరియు పూర్ణాహుతితో ఈ వేడుకలు ముగియనున్నాయి. భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు స్థానిక సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మండ్లు గ్రామ పెద్దలు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు కోరారు.

## జనగణనలో మాస్టర్ ట్రైనర్లు కీలకం

-కలెక్టర్ గరిమ అగ్రవాల్
-సీఎంఎంఎస్, డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31, తెలంగాణ పత్రిక



జనగణన - 2027 లో మాస్టర్ ట్రైనర్లు కీలకమని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జనగణన 2027లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, (సీఎంఎంఎస్), డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుండగా, మంగళవారం కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు.జనగణన సేకరించే వివరాలు కీలకమని స్పష్టం చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్, ఇతర అన్ని అంశాలపై డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ మాస్టర్ ట్రైనర్ శివ రామ కృష్ణ పూర్తి స్థాయిలో వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి అంశంపై తెలిపారు. శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాటాపై మహిపాల్ రెడ్డి ఘాటు విమర్శలు

-హరీష్ రావును విమర్శించే స్థాయి లేదన్న ఎమ్మెల్యే
-మైనింగ్, వసూళ్లు, భూ ఆరోపణలపై వివరణ

పటాన్చెరు నియోజకవర్గం మార్చి 31 తెలంగాణ పత్రిక





పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్ గౌడ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "హరీష్ రావును విమర్శించే స్థాయి నీది కాదు" అంటూ వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. మంత్రి కుటుంబ కార్యక్రమాల పేరుతో వసూళ్లు జరిగాయనే ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత కుటుంబంపై కూడా వివాదాలు ఉన్నాయని, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అమ్ముకున్నాడా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో బీఫాంల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వసూళ్లు పెరిగాయని, గత రెండున్నరేళ్ల లావాదేవీలపై స్పష్టత ఇవ్వాలని సవాల్ విసిరారు. అమీన్‌పూర్ సర్పంచ్‌గా పూర్తి కాలం పనిచేయలేదని విమర్శించారు. లకడారం గ్రామంలో 2012లో ప్రభుత్వ అనుమతులతో క్వారీ ప్రారంభించామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించామని చెప్పారు. 2024లో రాజకీయ కక్షతో క్వారీని సీజ్ చేసి, రూ.300 కోట్ల జరిమానా విధించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు క్వారీ యజమానులకు నోటీసులు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. హైకోర్టు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రీ సర్వే జరగాల్సి ఉన్నప్పటికీ అమలు కాలేదని తెలిపారు. పోచారం సర్వే నంబర్ 62లోని 5 ఎకరాల భూమి 1974లో స్వాతంత్ర సమరయోధుడికి కేటాయించబడిందని తెలిపారు. అనంతరం వ్యక్తిగతంగా విక్రయాలు జరిగాయని, తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

# కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

-జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ అరుణ్ జ్యోతి..

వీణవంక ప్రతినిధి, మార్చి 31( తెలంగాణ పత్రిక).



వీణవంక కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి కోరానికి సరిపడ రైతులు రాలేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. స్పెషల్ ఆఫీసర్ గా కొనసాగుతున్న జిల్లా అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ.. సరైన కోరం లేనందున సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయడం జరుగుతుందన్నారు. రైతుల గైహాజరుకు కారణాలను సీఈవో ప్రకాష్ రెడ్డి ని అడగగా.. రైతు సోదరులకు సమాచారం ఇవ్వడం జరిగిందని, కానీ పొలాల పనులలో బిజీగా ఉన్నందున రైతులు హాజరు కాలేదని అన్నారు. సర్వసభ్య సమావేశానికి వచ్చిన రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ.. వీణవంక సొసైటీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓ కు సెలెక్ట్ అయిందని, సొసైటీ పరిధిలో 750 మంది రైతులకు అవకాశం ఉంటుందని, ఒక రైతు 2000 రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందవలసి ఉంటుందని, దీనివల్ల రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు, ఫెర్టిలైజర్స్ అందుబాటు ధరలో రైతు సోదరులకు లభిస్తాయన్నారు. అలాగే ఏప్రిల్ ఒకటి నుండి కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా రైతులకు కావలసిన సేవలు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సొసైటీ పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, రైతు సంక్షేమ లక్ష్యంగా వీణవంక సొసైటీ సేవలు కొనసాగుతాయన్నారు .రాబోవు ఆర్థిక సంవత్సరంలో రైతు సోదరుల అండదండలతో సొసైటీని రాష్ట్రంలోని ప్రగతి పథంలో ముందంజలో ఉంచుతామని అన్నారు.

# ప్రజలను మభ్యపెట్టేందుకే 'అంకెల గారడీ' బడ్జెట్ ఉత్త మాయాజాలం

-రూల్స్ విరుద్ధంగా బడ్జెట్ సమావేశం హడావుడి వెనుక ఆంతర్యమేమిటి?
-పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ జీతాలు అమలు చేయాలి
-సిపిఎం కొత్తగూడెం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 31



కొత్తగూడెం కార్పొరేషన్ బడ్జెట్ ప్రజలు ఆకాంక్షలు తీర్చే విధంగా లేదనీ సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా ప్రకటన విడుదల చేశారు.బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితమైందని, కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.107 కోట్ల నిధులు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, రూ.140 కోట్లతో బడ్జెట్ రూపొందించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యగా పేర్కొన్నారు. ఈ అదనపు నిధులు ఎలా సమకూరుతాయనే విషయంలో స్పష్టత లేకపోవడం బడ్జెట్లో ప్రధాన లోపమని అభిప్రాయపడ్డారు. కార్పొరేషన్కు ప్రస్తుతం స్వంత ఆదాయం కేవలం రూ.33 కోట్లే ఉండగా, ఆదాయ వనరులను పెంచే దిశగా సరైన ప్రణాళిక లేకుండా ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆదాయ వనరులు చూపించకుండా ఖర్చు ఎలా పెడతారో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కార్పొరేటర్లు ఇచ్చిన హామీల్లో ఒక్కటికీ సరైన నిధుల కేటాయింపు జరగలేదని ఆరోపించారు. ప్రజలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ముఖ్యంగా కోతులు, కుక్కల సమస్యల పరిష్కారానికి ఎలాంటి ప్రణాళిక లేకపోవడం, కనీసం ఈ అంశాన్ని సమావేశంలో చేర్చకపోవడం పాలకవర్గం నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని విమర్శించారు. బడ్జెట్ రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం పెద్ద లోపమని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ సమావేశం నిర్వహించిన విధానంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం వరుసగా మూడు వర్కింగ్ రోజుల్లో మాత్రమే బడ్జెట్ సమావేశం జరగాల్సి ఉంటుందని తెలిపారు. కానీ ఒక రోజు ఆదివారం కాగా, సోమవారం మాత్రమే వర్కింగ్ డే, మంగళవారం మహావీర్ జయంతి సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండగా సమావేశం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విధంగా హడావుడిగా సమావేశం నిర్వహించడం వెనుక అంతర్యం ఏమిటో స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల వేతనాల్లో ఉన్న వ్యత్యాసంపై కూడా బాలరాజు తీవ్రంగా స్పందించారు. కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ ప్రాంతాల్లో మొత్తం 341 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అందరికీ ఒకే రకమైన జీతాలు ఇవ్వట్లేదని,అందరూ ఒకే విధమైన పని చేస్తున్నప్పుడు వేతనాల్లో ఈ వ్యత్యాసం ఎందుకని నిలదీశారు. ఈ అసమానత వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటో అధికారులే వివరించాలని డిమాండ్ చేశారు. "సమాన పనికి సమాన వేతనం" అనే సూత్రాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లేకపోతే ఇది కార్మికుల పట్ల అన్యాయం అవుతుందని అన్నారు.పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ స్థాయి జీతాలు ఇవ్వాలని,కానీ బడ్జెట్ లో ఆ ప్రస్తావన లేదని తెలిపారు. ఈ బడ్జెట్ నగర ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా లేదని లిక్కి బాలరాజు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా నిధుల వినియోగం జరగాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అంకెల గారడీ చేయకుండా, నిజమైన ప్రణాళికలతో ముందుకు రావాలని సూచించారు. నగర అభివృద్ధి కోసం సరైన దిశలో చర్యలు తీసుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ను పునర్విమర్శించి, లోపాలను సరిదిద్దాలని కోరారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

భిక్కనూరు మార్చి 31 (తెలంగాణ పత్రిక మండల. )





మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ పాలకవర్గం సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు, ఈ క్యాంపు కామారెడ్డి జిల్లా ఆసుపత్రి నుండి 6 గురు స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి రోగులను పరీక్షించారు,జనరల్ మెడిసిన్ డాక్టర్ పి.రుతిక వారు 63 పేషెంట్స్ పరీక్షించారు, గైనకాలజీ డాక్టర్ జి.దీప్తి 31 పేషెంట్స్ ను పరీక్షించారు, పెడియాట్రిక్స్ డాక్టర్ శ్రీలేఖ 20 పేషంట్లను పరీక్షించారు, ఆర్థోపెడిక్స్ డాక్టర్ ఆయేషా ఫాతిమా 30 పేషంట్లను పరీక్షించారు,డెంటల్ డాక్టర్ అనిల్ కుమార్ 15 పేషెంట్లను పరీక్షించారు, ఆప్తాలమాలో డాక్టర్ జి వర్షిక రెడ్డి 24 పేషెంట్లను పరీక్షించారు, ఈ రకంగా వచ్చిన పేషెంట్లను183 రోగులను పరీక్షించారు, ఈక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరమణ, సిబ్బంది సతీష్ కుమార్, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ ఈవో మహేష్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన

**-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి,31

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు ఎస్సైలను,ఒక ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ను మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు.37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై మీర్జా కమల్లా బేగ్,37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం దమ్మపేట పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై వంక రామరాఘవయ్య 36 సంవత్సరాలు తమ సేవలను అందించి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పరిశిక మల్లికార్జున రావు లు మంగళవారం నాడు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ ముగ్గురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ



తీసుకోవాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం జిల్లాలోని మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంది

**-కామారెడ్డి జిల్లా కలెక్టర్**

కామారెడ్డి , మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు రాష్ట్రం లో 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 10,000 పది వేల కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారు. ఉచిత బస్సు పథకం మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు, స్వావలంబనకు భరోసా, బలమైన అడుగు అని కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు ద్వారా నిన్నటి వరకు మహిళలు 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు పది వేల కోట్ల రూపాయల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా పాల్గొని, మహిళా ప్రయాణికులను సన్మానించారు. మహాలక్ష్మి పథకం మహిళల ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు స్వేచ్ఛగా ప్రయాణాలు చేస్తూ తమ అవసరాలను సులభంగా నెరవేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం వల్ల భారీ స్థాయిలో ఆర్థిక ఆదా జరిగిందని




తెలిపారు. 2023 డిసెంబర్లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా 290 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, మహిళలు, విద్యార్థులు కలిసి సుమారు రూ 10 వేల కోట్ల మేర ఆదా చేసుకున్నారని తెలిపారు జిల్లా స్థాయిలో రూ.656 కోట్ల వరకు ఆదా జరిగిందని అన్నారు. ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఆ డబ్బును కుటుంబ అవసరాలు, విద్య, ఆరోగ్యంపై వినియోగిస్తున్నారని కలెక్టర్ వివరించారు. ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది వేస్తోందని , ప్రభుత్వం మహిళల అభివృద్ధి కి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని,బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని అన్నారు. అదే విధంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలకు విద్యా శిక్షణ



అందించి పరీక్షలు నిర్వహించామని, మహిళల్లో చదువు పట్ల చైతన్యం పెరుగుతుండటం ఆనందకరమని పేర్కొన్నారు. అనంతరం మహాలక్ష్మి ఉచితబస్సులో ప్రతిరోజు ప్రయాణించే మహిళలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన గొప్ప వరంతో పాటు గౌరవమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులు, ఉద్యోగాలు, చిన్న వ్యాపారాల కోసం ప్రయాణించే మహిళలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. బస్సు చార్జీల ఆదా కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని, ఈ పథకం కుటుంబాభివృద్ధికి దోహదం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ మధుమోహన్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, డిపో మేనేజర్ మున్సిపల్ చైర్మన్ ఉమారాణి, అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి, మహిళలు, ప్రయాణికులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

**-ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి**

**-గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి.**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 31 మార్చి

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర



మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

# రోడ్లు భవనాల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మార్చి 31

రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని వారి కార్యాలయం లో కలిసి జగిత్యాల నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు.జగిత్యాల నియోజకవర్గం లో అనేక వంతెనలు చెడిపోయినాయి అదేవిధంగా రామాజీపేట, రాయికల్, పెంబట్ల బ్రిడ్జ్ ల పని పూర్తి అయినా గాని వాటి అప్రోచ్ రోడ్డు పూర్తి కాలేదు అని. పలు చోట్ల రోడ్లు రెన్యూవల్ చేయాల్సిన అవసరం ఉందనీ,నూతన రోడ్లు కూడా మంజూరు ఇప్పించాలని సారంగాపూర్ పోతారం,జగిత్యాల పోతారం, అంతర్గం నూతన రోడ్లు కావాలని నూతనంగా కొన్ని బ్రిడ్జ్‌లు గోవిందపల్లి బ్రిడ్జ్, నర్సింగ పూర్ బ్రిడ్జ్, పెరకపల్లి బ్రిడ్జ్,లో లెవెల్ బ్రిడ్జి లు రాయికల్ సారంగాపూర్ మండలంలో బ్రిడ్జి లు ఉన్నాయి,కొత్త వాటికి టెండర్ పిలవాల్సిందిగా వినతి



పత్రాన్ని అందజేశారు.సానుకూలంగా స్పందించిన మంత్రి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ కి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రికి జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.

# గురుకులాల్లో విషాదం: ప్రభుత్వ నిర్లక్ష్యంపై తెలంగాణ భవన్‌లో కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం




సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 31, తెలంగాణ పత్రిక

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల పాఠశాలల్లో పర్యవేక్షణ లోపించిందని, విద్యార్థుల భద్రత మరియు సంక్షేమంపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం, అంతర్గత వేధింపుల కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొంటూ, దీనిపై వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గురుకుల వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల ప్రాణాలతో రాజకీయం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వినయ్ కుమార్, ఎండి అజ్జు, లింగంపల్లి రామ్ చరణ్, పవన్, జశ్విత్, ఈశ్వర్, కలీం తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ లో రాత్రి వీచిన గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న

**-బోరున విలపిస్తున్న రైతు సోదరులు..**



వీణవంక ప్రతినిధి, మార్చి 31( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలంలోని రామకృష్ణాపూర్, వీణవంక, నర్సింగాపూర్ గ్రామాలలో సోమవారం రాత్రి వీచిన గాలివానకు మొక్కజొన్న పైర్లు నేలకొరిగాయి. వీణవంక, నర్సింగాపూర్ గ్రామాలలో మొక్కజొన్న పైరు స్వల్పంగా నేలకుఒరగగా,రామకృష్ణాపూర్ గ్రామంలో మొక్కజొన్న పైరు పూర్తిగా దెబ్బతిని రైతులకు తీవ్రనష్టాన్నికలిగించింది.రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన అప్పని సంపత్, అప్పని ఐలయ్య,ఎజ్జు మొగిలి, అప్పని శ్రీనివాసు కు చెందిన ఎకరం మొక్కజొన్న పైర్లు పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లిందని వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే, వ్యవసాయ అధికారులతో పంట నష్టం సర్వేలు చేపట్టి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



కామారెడ్డి,మార్చ్31,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల మర్కల్ గ్రామ సర్పంచ్ ప్రియాంక సుభాష్ రెడ్డి అన్నారు.మంగళవారం గ్రామంలో మహిళా సమైక్య భవనానికి ఆయన భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా సంఘాలు బలోపేతం కావాలని,స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.మహిళల సాధికారత కోసం ఇలాంటి భవనాలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రసాద్,సీసీ ప్రతాప్,గ్రామస్థులు ఉన్నారు.

## గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ఉండాలి



 భిక్కనూరు మార్చి 31 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండలంలోని కంచర్ల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు, ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య,పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ కలిసి మెలిసి ఉంటేనే గ్రామం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా తెలిపారు, ఈ క్రమంలో హాస్టల్ వార్డెన్ సరిత హెడ్ కానిస్టేబుల్ పిట్ల రవీందర్, జి.పి.ఓ సాయిబాబా, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామ సర్పంచ్ గొల్ల అరుణ, ఉపసర్పంచ్ రమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు

-ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 31 మార్చి

హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని హనుమాన్ దేవాలయాలు, ఊరేగింపు మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు, ఇతరులను కించపరిచే ప్రవర్తన, అనవసర గొడవలకు పాల్పడితే సంబంధితులపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలని, అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేయరాదన్నారు. జిల్లా ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ కోరారు.

## ఏప్రిల్ 01 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861

-జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 31 మార్చి



మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఏప్రిల్ 01 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారు తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.

# వృద్ధ దంపతుల పై ధాడి దోపిడీ 48 గంటల్లో కేసు ఛేదన





-బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 31 మార్చి

జంగారాయి గ్రామంలో వృద్ధ దంపతులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పరామర్శించారు. ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించిన దోపిడీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. బాధితులు సావిత్రి, అంజయ్యలను ఎస్పీ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనతో కలిగిన భయాందోళనలను తొలగిస్తూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసుల పనితీరుపై జంగరాయి గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపించారు. జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు అందించిన సమాచారంతోనే నిందితుడిని త్వరగా గుర్తించి పట్టుకోవడం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్లూస్ అందించిన గ్రామస్థులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. ప్రజలు--పోలీసులు సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలో భద్రతా చర్యలను బలోపేతం చేయాలని చెప్పారు. అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎస్సై నారాయణ, సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరం ప్రారంభం







-డాక్టర్ శిరీష, సౌజన్య

వెల్దుర్తిమండల ప్రతినిధి, మార్చ్ 31 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచి ఆదర్శ ఉపసర్పంచి శ్రావణ్ కుమార్ వైద్య బృందంతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. వైద్య శిబిరంలో వైద్య బృందం గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు రక్త పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శిరీష సౌజన్య తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ లను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన రోడ్డు భద్రతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ,ఎస్పీ

కామారెడ్డి, మార్చి 31,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత పై కామారెడ్డి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం డ్రగ్స్ రహిత కామారెడ్డి లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు -- రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, వివిధ శాఖల అధికారులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన రోడ్డు భద్రత పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, “డ్రగ్స్ రహిత కామారెడ్డి” లక్ష్య సాధనలో అన్ని ప్రభుత్వ విభాగాలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం , అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టం చేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు సోషల్ మీడియా వేదికల ద్వారా చిన్న వీడియోలు, రీల్స్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. సమాజంలోని ప్రతి కుటుంబం, విద్యాసంస్థలు సమిష్టిగా పనిచేసినప్పుడే మాదకద్రవ్యాల సమస్యను నిర్మూలించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై జిల్లా ఎస్పీ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 276 మంది మరణించగా, పోలీసులు , సంబంధిత శాఖలు తీసుకున్న చర్యల ఫలితంగా 2025లో ఆ సంఖ్య 225కి తగ్గిందని వివరించారు. మరణాల సంఖ్య తగ్గినప్పటికీ, భవిష్యత్తులో ప్రమాదాలను మరింత తగ్గించడం లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని ఆర్ అ బి, నేషనల్ హైవేస్ , పంచాయతీరాజ్ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకర మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రివేళల్లో స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ రంగు చిప్స్ (రేడియం స్టిప్స్) అమర్చాలని కలెక్టర్ , ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ జిల్లా , పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పనితీరును ప్రశంసించిన ప్రత్యేక అధికారిణి







-పల్లెల్లో పనులు భేష్.
-ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి రమాదేవి.

రంగారెడ్డి,మార్చి 31(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):
పల్లెల్లో పనులు ప్రజాపాలన కార్యచరణ ప్రణాళిక బాగున్నాయని, ప్రజా ప్రతినిధులు, అధికారుల పనితీరును ప్రశంసించారు మండల ప్రత్యేక అధికారిణి రమాదేవి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గాను ప్రజాపాలన, 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా మంగళవారం ప్రత్యేక అధికారి రమాదేవి మండలంలోని కొండారెడ్డిపల్లి, చొల్లపల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మిక తనిఖీ చేసి ఈనెల మార్చి 6 వ తారీఖు నుండి ఇప్పటివరకు జరిగిన వివిధ కార్యక్రమాలపై గ్రామ పంచాయతీ పారిశుద్ధ్యము, గ్రామ పంచాయతీలకు వైట్ పెయింట్ బోర్డు లోగోలు, రోడ్ల పరిశుభ్రత, మోరీల పరిశుభ్రత, పాఠశాలలో అంగన్వాడీలు, ఇందిరమ్మ ఇండ్లు, సెగ్రేగేషన్ షెడ్డులు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు పరిశీలించడం జరిగిందని ఎంపీడీఓ మీడియా కు తెలిపారు. ఈ ప్రత్యేక అధికారి వెంట ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, కిష్టయ్య మండల పంచాయతీ అధికారి, వజ్రమ్మ సర్పంచ్ చెల్లపల్లి, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వార్డు సభ్యులు ఉన్నారు...

# విద్యావేత్తకు అరుదైన పురస్కారం

-వాజిద్ పాషాకు గౌరవ డాక్టరేట్ ప్రధానం.
-అవార్డుతో పాటు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ లో యాక్టివ్ సభ్యులుగా నియామకం.
-హార్షం వ్యక్తం చేస్తున్న మ్యాగ్నెట్ పాఠశాల అధ్యాపక బృందం..






రంగారెడ్డి,మార్చి 31(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)
మ్యాగ్నెట్ స్కూల్, శ్రీ నారాయణ విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ ఎండీ.వాజిద్ పాషా కు అరుదైన పురస్కారం దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా న్యూయార్క్ ప్రతినిధులు వాజిద్ పాషా కు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా, సామాజిక, విద్యా రంగాల్లో కనబరిచిన ప్రతిభకు గాను ఆయనకు ప్రతిష్టాత్మక 'భారత్ గౌరవ్ రత్న శ్రీ సమ్మాన్' అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్‌లో యాక్టివ్ సభ్యులు గా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారని మీడియా కు తెలిపారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వాజిద్ పాషాకు మ్యాగ్నెట్, శ్రీనారాయణ విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు. విద్యా రంగంలో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నారు.

# అంటరానితనం పై అవగాహన సదస్సు



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చి 31 .
కోటగిరి మండలంలోని ఎత్తొండ్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధికి సంబంధించిన సమాచారం పై, అంటరానితనంపై తహసిల్దార్ కాంబ్లీ గంగాధర్ గ్రామస్తులకు అవగాహన సదస్సును కల్పించారు. ఈ అవగాహన సదస్సులు ఆయన మాట్లాడుతూ.... గ్రామంలోని రెండు గ్లాసుల పద్ధతిపై ఆలయాలలోని దళితులను రాణి ఇవ్వకుండా ఎవరైనా అడ్డు తాగిన సమాచారం అందించాలన్నారు. నేటి సమాజంలో అంటరానితనం అనేది తొలగిపోయిందన్నారు. గ్రామాలలో అగ్ర కులాల వ్యక్తులు దళితులని కులం పేరుతో దూషించిన కఠినంగా శిక్షలను వేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా అగ్రకులాల వ్యక్తులు దళితులకు ఇబ్బందులను కలిగించే విధంగా ప్రవర్తించులతో సమాచారం అందించాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కోటగిరి తహసిల్దార్ గంగాధర్ ఆర్ ఐ ఏ.ఎస్.ఐ. బన్సీలాల్ స్థానిక గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ భీమసేన అధ్యక్షులు కోర్బా సతీష్ మచ్కూరి రాజ్ కుమార్ సాయిలు దండు నాగేష్ గా గాక్వాడ్ రాహుల్ గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది

-కొత్త బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ బి. సత్యప్రసాద్.




జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మార్చి 31
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణ చార్జీలలో 10,000 కోట్ల ఆదాయం ఆదా అయిందని తెలిపారు. ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఆ డబ్బును కుటుంబ అవసరాలు,విద్య, ఆరోగ్యంపై వినియోగిస్తున్నారని వివరించారు. ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది వేస్తోందని చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా బస్టాండ్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతమైన, భద్రమైన ప్రయాణ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రయాణించే కొంత మంది మహిళలకు జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానం చేసి, బహుమతులు అందించారు. మహిళల భాగస్వామ్యం ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతుకు కడుపునిండా దుఃఖం, కంటి నిండా రక్తం



ఎలిగేడు, మార్చి31, (తెలంగాణ పత్రిక) -
ఎలిగేడు మండలంలోని పలు గ్రామాల వ్యాప్తంగా ప్రకృతి విపత్తు పంటలను నాశనం చేసింది ఆరుకాలంగా కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నాశనమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలుకులకు మొక్కజొన్న, మామిడి తోటలు, వారిపైరులు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముప్పిరితోట గ్రామపంచాయతీ సంబంధించిన 22 ఎకరాల మామిడి తోటను అదే గ్రామానికి చెందిన ముత్యం లచ్చయ్య 7 లక్షల 5వేల రూపాయలకు వేలపాటులో దక్కించుకున్నారు. ఈదురుగాలుల మూలంగా ఆ మామిడి తోట కాయలు పూర్తిగా రాలిపోయాయి మామిడి తోట దిగుబడి రావాలని 68 వేల రూపాయలు విలువ చేసే ఎరువులను వేయడం జరిగిందని రైతు తెలిపారు. తీరా చూస్తే ఎరువుల పట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# అకాల వర్షాలకు నష్టపోయిన పంటలు పరిశీలించిన ధావ వసంత



జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) మార్చి 31
కిష్టంపేట గ్రామంలో నిన్న కురిసిన వర్షాలకు నష్టపోయిన మామిడి, వరి పంట పొలాలను బి ఆర్ ఎస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించి నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పిన జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దానికి తోడుగా ప్రకృతి కూడా రైతులపై కన్నెర్ర చేసిందని అన్నారు. అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం పంట నష్టపరిహారాన్ని అందజేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన జాబ్ మేళా

-ఎమ్ఎస్ ఎన్.ల్యాబ్స్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా




రంగారెడ్డి,మార్చి 31(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ , డాక్టర్.ఎల్.కమల అధ్యక్షతన, వైస్ ప్రిన్సిపాల్ పాలాది శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎమ్ఎస్ ఎన్. ల్యాబ్స్ వారి ఆధ్వర్యంలో బిఎస్సీ,కెమిస్ట్రీ, బిఎ, బికామ్, పాసైన పురుష విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఇందులో 41 మంది పాల్గొన్నారు. 8 మంది అభ్యర్థులు ఎంపిక కావడము జరిగినది. ఎంపికైన అభ్యర్థులకు జీతము తో పాటు నైట్ షిఫ్ట్ అలోవెన్స్, ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీతో కూడిన క్యాంటీన్ సౌకర్యము, ఈఎస్ఐ, ఈ.పిఎఫ్. గ్రాట్యూటి సౌకర్యము కల్పించబడునని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ తరఫున ప్రశాంత్ భూషణ్ రెడ్డి, ఎచ్ఆర్. మురళి ప్రొడక్షన్ మేనేజర్ భరత్ కుమార్ రెడ్డి,ప్రొడక్షన్ డిపార్ట్మెంట్, అనురాధ కామర్స్ సధ్యాపకులు, సందీప్ హిస్టరీ అధ్యాపకులు పాల్గొన్నారు...

# ప్రజాసేవలో మరింత ముందుకు

-ఎగ్జిక్యూటివ్ స్పెషల్ ఇన్విటీస్‌గా బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి ఎంపిక.



రంగారెడ్డి,మార్చి 31(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):
తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ స్పెషల్ ఇన్విటీస్‌గా జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారికి ఎంపికవడం జరిగింది. మీ సేవా స్ఫూర్తి, నాయకత్వం మరింత ఉన్నత స్థాయికి చేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు కల్వకుర్తి, ఆమన్ గల్ ప్రజలు, బీజేపీ నాయకులు, యువకులు. ప్రజాసేవలో మీరు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని కోరుకుందాం...

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143